# నిఫ్టీ 6,350 పాయింట్లు..

## ● ఈ ఆర్థిక సంవత్సరంలోనే!?



పి. జయప్రకాశ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో ఆశాభరితమైన సంకేతాలు కొన్ని వెలువడ్డాయి. అవేమిటంటే..

- 3జీ స్పెక్ట్రమ్, బ్రాడ్‌బ్యాండ్ వైర్‌లెస్ యాక్సెస్ (బీడబ్ల్యూఏ) వేలం నుంచి రూ. 40,000 కోట్లు సమీకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా, అంతకు మించి రూ. లక్ష కోట్లకు పైనే వసూలయింది. దీని వల్ల ఆర్థిక లోటు కొంత మేర తగ్గనుంది.
- పెట్రోలియమ్ ఉత్పత్తులపై ధరల నియంత్రణను ప్రభుత్వం దశల వారీగా తొలగిస్తోంది. ఫలితంగా ప్రభుత్వంపైన ఆర్థిక భారం ఆ మేరకు తగ్గిపోతుంది.
- తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 20 శాతం, పరోక్ష పన్నుల వసూళ్లు 43 శాతం చొప్పున పెరిగాయి.
- రుతుపవనాలు ఇప్పటి వరకు సానుకూలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వర్షాలు బాగానే ఉంటాయని తోస్తున్నది.
- కార్పొరేట్ల ఆర్థిక ఫలితాల ప్రకటనకు సంబంధించి భారత్ ఐఎఫ్ఆర్ఎస్ (ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్) విధానాన్ని అమలు చేయనుంది.

ఇలా కీలకమైన అంశాలను చూసినప్పుడు ప్రభుత్వం స్థాయిలో, కార్పొరేట్ల స్థాయిలో పనితీరు మెరుగ్గా కనిపిస్తోంది. మన దేశం నెమ్మదిగా 9 శాతం అధిక ఆర్థికాభివృద్ధి దిశగాను, 20- 25 శాతం వ్యాపారాభివృద్ధి పథంలోను సాగుతోంది. 'దేశీయ వినియోగం' ఆయువుపట్టుగా ఆర్థిక వ్యవస్థ దశ తిరుగుతోందని చెప్పవచ్చు. ఈ అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకొని స్టాక్‌మార్కెట్లు కూడా జోరందుకుంటాయి. నిఫ్టీ (ఎన్‌ఎస్ఈ సూచీ) ఈ ఆర్థిక సంవత్సరంలోనే చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి అయిన 6,350 పాయింట్లను చేరుకొనే అవకాశం ఉంది.

ప్రస్తుతం రిటైల్ మదుపరులు స్టాక్‌మార్కెట్‌ను అనుమాన దృక్కులతో చూస్తూ, మార్కెట్‌కు దూరంగా ఉన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థాగత మదుపుదారులు మాత్రం నాణ్యమైన కంపెనీల షేర్లను కొనుగోలు చేస్తున్నారు. భారత దేశంలో నాణ్యమైన, స్థిరమైన వృద్ధి ఉందనే విషయం ప్రపంచానికి తెలుసు. కొన్ని అసాధారణమైన పరిస్థితులు ఎదురయితే తప్పించి, స్టాక్‌మార్కెట్‌కు ఇప్పట్లో ఇబ్బందులు ఏమీ ఉండకపోవచ్చు. ప్రస్తుతం షేర్ల ధరలు కాస్త అధికంగా కనిపిస్తున్నా, కార్పొరేట్లు ఐఎఫ్ఆర్ఎస్ విధానానికి మారిన తరువాత ఒక్కసారిగా విలువలు మారిపోతాయి. అందువల్ల ముమ్ముందు ఆసక్తికరమైన పరిణామాలను చూడవచ్చు.

(రచయిత ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్ డైరెక్టర్)